క్లుప్తంగా

ప్రహరీ నిర్మాణానికి కృషి



చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

దహెగాం: మండలంలోని చిన్న ఐనం గ్రామంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన గిడ్డంగి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య అన్నారు. బుధవారం గిడ్డంగిని సందర్శించారు. అనంతరం మొదటిసారిగా మార్కెట్ కమిటీ చైర్మన్ రావడంతో మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నిధులు మంజూరు చేయాలని మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గండె వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తోగయ్య, సమీర్, రాజారాం, సంతోష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

దహెగాం: మండలంలోని బీబ్రా శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో బుధవారం దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న నిట్టూరి అంజయ్య, ఉండిరి వాడే మనోజ్, జుమ్మిడి వెంకటిలతో పాటు మరికొంత మంది ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి రూ. 400 నగదు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ సతీష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రహపల్లి గ్రామ శివారులో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం రావడంతో మంగళవారం అర్ధరాత్రి దాడి చేసి ఇద్దరు వ్యక్తులు పట్టుకోగా.. ఐదుగురు పారిపోయినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ. 10,100 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: దసరా పండుగను పురస్కరించుకుని ఆరెగూడ గ్రామ పంచాయతీలో వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు అన్నారు. క్రీడలు యువకుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎ సలీం, రాజు, ఆవుల రాజ్‌కుమార్, నక్క మనోహర్, అంజన్న, సత్తయ్య, సోమయ్య, రవి, ప్రకాశ్, సాయి పాల్గొన్నారు.

మహా చండీ హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

దహెగాం: శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద బుధవారం చండీ హోమం నిర్వహించారు. ఏడో రోజు అమ్మవారు సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేద పండితులు భీమనాధుల పరమేశ్వర్, మహేశ్, విఘ్నేషల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



ఇంకుడు గుంత పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామంలో జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2024లో భాగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. బుధవారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2024లో నిర్మాణం చేస్తున్న ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2024 అవార్డులో భాగంగా గ్రామంలో 72 మరుగుదొడ్లు, 173 ఇంకుడు గుంతలు మంజూరు చేసినట్లు తెలిపారు. పనులను అధికారులు వేగవంతం చేయాలన్నారు. ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, టెక్నికల్ అసిస్టెంట్‌లు విఠల్, సుందర్‌సింగ్, ధమ్మనంద్ పాల్గొన్నారు.

మూత్రశాలలెక్కడ..?



నిరుపయోగంగా బస్టాండ్‌లోని మూత్రశాలలు



బస్టాండ్ వెనుక పెరిగిన పిచ్చి మొక్కలు

- మండల కేంద్రంలో లేక ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కౌటాల: జిల్లాలోనే కౌటాల మండలం దినదినంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది. మండలంలో మొత్తం జనాభా సుమారు 40 వేలకు పైగా ఉంది. కానీ కౌటాల మండల కేంద్రంలో ప్రభుత్వ సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో మండల వాసులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రతీరోజు కౌటాలకు ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో అత్యవసర సమయాల్లో ఒకటి, రెండింటికి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

ఎక్కడ పడితే అక్కడే..

సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ శాఖ, సహకార సంఘం, ఐకేపీ కార్యాలయాల వెనుక ప్రాంతంలో ఆరు బయట మూత్రం పోస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మూత్రశాలలు నిర్మించినా.. ఇంకా వినియోగంలోకి రాలేదు. అలాగే కౌటాల బస్టాండ్ ఏరియా ప్రాంతం ప్రతీరోజు ప్రజలతో రద్దీగా ఉంటుంది. ఆ ప్రాంతంలో మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు స్థానిక పాత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు వినియోగంలో లేకపోవడంతో పీహెచ్‌సీ ఆవరణంతో పాటు సమీప గుట్ట మీదకు వెళ్లి ఆరు బయటే మూత్రం పోస్తున్నారు. దీంతో కార్యాలయ సిబ్బందితో పాటు విద్యార్థులు, ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

భరించలేని దుర్గంధం..

ప్రభుత్వ కార్యాలయాల వెనుక ప్రాంతంలో ప్రజలు ఆరుబయటనే మూత్రం పోస్తున్నారు. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. అలాగే ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండడంతో ప్రయాణికులు ఆరుబయటనే కానిస్తున్నారు. బస్టాండ్‌కు వచ్చిన ప్రజలు, ప్రయాణికులు ముక్కు మూసుకొని బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాండ్ వెనుక ప్రాంతంలో పిచ్చి మొక్కలు, చెత్తచెదారం పేరుకుపోవడంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. బస్టాండ్ వెనక ప్రాంతం అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలోని పలు రద్దీ ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ మరుగు దొడ్లు లేవు. దీంతో బస్టాండ్, ప్రభుత్వ కార్యాలయాల వెనుక ప్రాంతం ఆరు బయట మూత్రం పోయాడానికి ఇబ్బంది పడుతున్నాం. వారసంత నిర్వహణ రోజు వచ్చిన ప్రజల పరిస్థితి మరి దారుణంగా ఉంది. మహిళల బాధలు వర్ణనతీతం. ఇప్పటికైనా మండల కేంద్రంలో ప్రభుత్వ సులభ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అధికారులు చొరవ చూపాలి.

– మోర్లె పాండురంగ్, కన్నెపల్లి

ఇబ్బంది పడుతున్నాం



ఆర్టీసీ బస్టాండ్‌లోని కొత్తగా నిర్మించిన మూత్రశాలలకు నీటి సదుపాయం లేక నిరుపయోగంగా మారింది. దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ప్రతీరోజు మండల కేంద్రానికి ప్రజలు, విద్యార్థులు, రైతులు వస్తుంటారు. మూత్రశాల లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయ వెనుక, సమీప గుట్ట మీదకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– పెరుగు రాజు, కౌటాల

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు



మంగళహారతులు ఇస్తున్న మహిళలు

రెబ్బెన: శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవీ, స్వయంభూగా వెలిసిన మహాంకాళి ఆలయంలో ఉత్సవాలను అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బుధవారం అమ్మవారు సరస్వతీ దేవీ అవతారంలో దర్శనమివ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాం నాయక్, కోనేరు ట్రస్ట్ అధ్యక్షుడు కోనేరు వంశీ, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ కోనేరు కృష్ణ కుటుంబసభ్యులు ఇందిరానగర్‌లోని దుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. అలాగే గోలేటి సీహెచ్‌పీలోని దుర్గామాత ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఏడో రోజు అమ్మవారు సరస్వతీ రూపంలో దర్శనమిచ్చారు. పలు మండపాల వద్ద అమ్మవారిని వివిధ అలంకరణలో ఆలంకరించారు. అమ్మవారి మండపాల వద్ద మహిళలు అష్టోత్తర శత నామావళి, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా పల్లకిసేవ

- జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవ నాథస్వామి ఆలయంలో దేవాదాయ, ధర్మధాయ శాఖ ఆధ్వర్యంలో శరన్నవరాత్రులను కొనసాగుతున్నాయి. స్వామివారిని గరత్మంతుడి వాహనంలో శోభాయాత్ర చేపట్టారు. మొదట ఆలయంలో అర్చకులు ఒజ్జల నరేశ్ శర్మ, సూర్యనారాయణ శర్మల ఆధ్వర్యంలో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, విష్ణు సహస్రనామం, లలితా సహస్రనాయం, గోవిందనామాలు, మంగళహారతి, మంత్ర పుష్పం చేపట్టారు.



దర్శించుకుంటున్న అజ్మీర శ్యాం నాయక్



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గిరి గ్రామాల్లో గ్రామసభలు



మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఎంపీడీవో అల్బర్ట్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై దరఖాస్తు చేశారు. కమ్మర్‌గాంలో రేషన్ డిపో మరమ్మతులు, సెల్ టవర్ ఏర్పాటు, ఏటిగూడ నుంచి నందిగామ, మురళీగూడ నుంచి పెంచికల్‌పేట్ వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు చెరువుల మరమ్మతులు, గిరి వికాస్‌లో బోర్ల ఏర్పాటుకు దరఖాస్తు సమర్పించారు. త్రీఫేజ్ కరెంటు లేక మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారి ఈఈ ప్రభాకర్‌రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, గ్రిడ్ డీఈ పృథ్వీ, ఎఫ్ఆర్‌వో అనిల్‌కుమార్, ఏఈలు బద్రొద్దీన్, మనోహర్ పాల్గొన్నారు.

'భీం వర్ధంతి వరకు సెలవులు లేవు'

కెరమెరి: కుమురం భీం వర్ధంతి ముగిసే వరకు సెలవులు లేవని జిల్లా పరిషత్ సీఈవో, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 17న జోడేఘాట్‌లో కుమురం భీం 84వ వర్ధంతిని నిర్వహిస్తామని, విజయవంతం చేయాలన్నారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు రోడ్డు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. అందరూ సమన్వయంతో పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ప్రత్యేకాధికారులు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు డంపింగ్‌యార్డులో వేయాలి

కౌటాల: చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను డంపింగ్ యార్డులోని కంపోస్ట్ తయారీ కేంద్రంలో వేయాలని కౌటాల ఎస్సై మధుకర్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో చికెన్ సెంటర్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ షాపులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కోళ్లను మంచినీటితోనే శుభ్రం చేయాలని, మురికినీటితో శుభ్రం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేస్తే ప్రజలు అనారోగ్య బారిన పడతారన్నారు. అధిక ధరలకు మాంసం విక్రయించొద్దని, నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో చికెన్ షాపు యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

కెరమెరి: ఈనెల 17న మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించే 84వ కుమురం భీం వర్ధంతి సందర్భంగా బుధవారం ఉపాధిహామీ అధికారులు పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం ముమ్మరంగా చేపడుతున్నారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు 120 మందికి పైగా కూలీలతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించే పనిలో పడ్డారు. అలాగే స్మృతివనం, మ్యూజియం, పార్కు ప్రాంతాలను శుభ్రం చేస్తున్నారు.

భోజనాల ఏర్పాటు అభినందనీయం



మాట్లాడుతున్న పేరం శ్రీనివాస్

రెబ్బెన: దసరా సందర్భంగా సింగరేణి యాజమాన్యం సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ భోజనాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోలేటి సీహెచ్‌పీలో ఆయన మాట్లాడారు. కార్మిక సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కట్టుబడి పని చేస్తోందన్నారు. ఉద్యోగులందరూ సంతోషం వ్యక్తం చేసేలా నిర్ణయం తీసుకున్న సంస్థ సీఎండీ బలరాంకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు ప్రకాష్‌రావు, మహేందర్, శ్రీకాంత్, గట్టయ్య పాల్గొన్నారు.


అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



స్వామివారి పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి స్థానిక బాలాజీ వేంకటేశ్వర ఆలయం నుంచి స్వామి వారిని హన్మంత వాహనంలో ఊరేగించారు. డొనల్, రజక కాలనీ, శివాజీ నగర్ తదితర ప్రాంతాల మీదుగా స్వామి వారి పల్లకి ఊరేగించారు. భక్తులు స్వామివారి పల్లకికి హారతులు, పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు బతుకమ్మలు ఆడి సంబురాలు జరుపుకున్నారు.

పెసా చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న అధికారులు

నార్నూర్: ఏజెన్సీలో 1/70 పెసా చట్టాలను గ్రామ స్థాయి నుంచే పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి గంగాధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పెసా చట్టం ప్రకారం గిరిజనుల భూములను గిరిజనేతరులు కొనరాదు, అమ్మరాదన్నారు. భూమిని అద్దె లేదా కౌలుకు తీసుకున్న నేరమేనన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టరాదని అన్నారు. గిరిజనేతరులు ఎవరైనా ఇంటి పని ప్రారంభిస్తే వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శులు నోటీసులు ఇచ్చి పనులు నిలిపి వేయాలని ఆదేశించారు. చట్టాలపై అవగాహన లేకుంటే ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎంపీడీవో జవహార్, తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీవో స్వప్న శీల, ఈజీఎస్ ఏపీవో సురేశ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి): కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండలం మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం వేకువజామున టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 49 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా.. పట్టుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వ్యాన్ డ్రైవర్ సల్మాన్ హుస్సేన్‌తో పాటు వ్యాపారి ఎండీ శంశీద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

ఇచ్చోడ: మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేయనున్నట్లు ఆర్ఐ హుస్సేన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నేరడిగొండ మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందచేయనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

చింతలమానెపల్లి: మండలంలోని గ్రామ పంచాయతీలో పారిశుధ్యం పనులు సక్రమంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులు, ఆయా శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ అధికారి తమ శాఖల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. శ్రీనిధి పథకంలో మహిళలకు ఆర్థిక లబ్ధి, వ్యాపారాలు నిర్వహించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోట ప్రసాద్, వైద్యాధికారి రాజ్‌కుమార్, ఏఈ ఉదయ్‌వీర్, ఈజీఎస్ గోవర్ధన్ సింగ్, తిరుపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఈవో శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు

రెబ్బెన: ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీల ఓటరు నమోదు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. బుధవారం ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్న ఓటర్ల దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదుకు ఎన్నికల సంఘం వచ్చే నెల 6 వరకు అవకాశం కల్పించిందన్నారు. అర్హత కలిగిన ఓటర్ల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటరు నమోదు కోసం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 63 దరఖాస్తులు స్వీకరించామన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలోని హనుమాన్ మందిర్ వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలతో స్థానిక పెద్దవాగు తీరానికి వచ్చి బతుకమ్మ ఆడారు. సాయంత్రం 6 గంటలకు హనుమాన్ మందిర్ వద్ద మహిళలు ఏకరూప దుస్తులు ధరించి, రంగురంగు పూలతో బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. యువతులు, చిన్నారులు డీజే పాటలకు స్టెప్పులేశారు. అనంతరం పెద్దవాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

బాసరలో సిర్పూర్ ఎమ్మెల్యే పూజలు



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బాసర: మండల కేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు దర్శించుకున్నారు. వీరికి బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్ అమ్మవారి హారతి, తీర్థప్రసాదం అందించి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. వారి వెంట మాజీ సర్పంచ్ సతీశ్‌రావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జిద్దు సుభాశ్ యాదవ్ ఉన్నారు.